## క్లుప్తంగా

### కొనుగోలు కేంద్రం ప్రారంభం



బూర్గుపల్లిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రైతులు

భీమారం: డీసీఎంఎస్ ద్వారా భీమారం మండలం బూర్గుపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎన్నికల నేపథ్యంలో మంగళవారం రైతులు ప్రారంభించారు. గతంలో ఎప్పుడైనా వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు కేంద్రాలను ప్రారంభించే వారు. అయితే ఎన్నికల కోడ్ ఉన్న పరిస్థితుల్లో రైతులే ముఖ్యఅతిథులుగా మారారు.

### 23న మండల సమావేశం

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 23న ఉదయం 11గంటలకు ఎంపీపీ గుర్రం మంగ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

### అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ పరిశీలన



కౌన్సిలింగ్ ఇస్తున్న డాక్టర్ శిరీష

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీని మంగళవారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజర్ జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి కేసులు ఎన్ని ఉన్నాయో పరిశీలించారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణతేజ, డీపీఎంవోలు శివకుమార్, రాఘవయ్య, హెచ్‌ఈవో జగదీశ్, సబ్ యూనిట్ అధికారి పుట్ట సత్తయ్య, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

### ఓటు హక్కు వినియోగించుకోవాలి

కాసిపేట: ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా కాసిపేట ఎస్సై గంగారాం సూచించారు. మండలంలోని కోమటిచేనులో ఓటర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి ప్రలోబాలకు, భయభ్రాంతులకు లొంగకుండా పోలీసు శాఖ నమ్మకం కల్పిస్తుందని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

### ఎల్ఐసీ ఏజెంట్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎల్ఐసీ అధికారులు

పాతమంచిర్యాల: మంచిర్యాల ఎల్ఐసీ బ్రాంచ్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్న సిరిపురం శ్రీనివాస్‌ను ఎల్ఐసీ బ్రాంచ్ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్ 33సంవత్సరాలుగా ఏజెంట్‌గా, చైర్మన్ క్లబ్ మెంబర్‌గా కొనసాగుతూ యూఎస్ఏలో నిర్వహించే 2024ఎండీఆర్టీ మిలియన్ డాలర్ రౌండ్‌టేబుల్ సమావేశానికి అర్హత సాధించిన సందర్భంగా సమావేశం నిర్వహించి సన్మానం చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎల్ఐసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ సోమేశ్వర్, ఏబీఎంలు సురేంద్ర, మల్లేషలు, ఏజెంట్‌లు పాల్గొన్నారు.

### సురక్షిత ప్రయాణంపై విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో సేఫ్ అన్ రోడ్ (సురక్షిత ప్రయాణం)లో భాగంగా మంగళవారం స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. పాఠశాల నుంచి కాలేజీరోడ్, ఓవర్‌బ్రిడ్జి వరకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. వాహన చోదకులకు పుష్పాలు అందజేస్తూ హెల్మెట్, సీటు బెల్ట్ ధరించటం, ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోబిన్, ఇన్‌చార్జి వెన్నెల, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా మత్స్య దినోత్సవం



దండేపల్లి: వల ప్రదర్శనతో మత్స్యకారులు



జెండావిష్కరణ చేస్తున్న సంఘం నాయకులు

దండేపల్లి: ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని దండేపల్లిలో మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చేపల వలలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడారు. ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా వలలు, మోపెడ్ వాహనాలు, చెరువుల్లో చేప పిల్లలు అందించడం సంతోషమన్నారు. చేప పిల్లలను సకాలంలో నాణ్యతవి అందించాలన్నారు. సంఘం అధ్యక్షుడు మెంగు లింగన్న, ప్రధాన కార్యదర్శి గంగన్న, సభ్యులు నక్క ఆశన్న, గంగధరి మల్లేష్, కల్లూరి భీమయ్య, గరిగె నర్సయ్య, సిద్ధి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని వాడబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడ బలిజ సేవా సంఘం జెండా ఆవిష్కరించారు. వాడబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బోడంకి మహేష్, కమిటీ సభ్యులు గగ్గూరి రాజన్న మాట్లాడుతూ.. ప్రపంచంలో 75శాతం నీరు ఉంటే 25శాతం భూభాగం ఉందని నీటిలో మానవాళికి కావాల్సినంత మత్స్య సంపద నీటిలో ఉందని చేపల వేటతో ఎంతో మంది అమరులయ్యారని వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రపంచదేశాలు నవంబర్ 21ని ప్రపంచ మత్స్య కారుల దినోత్సవంగా జరుపుకుంటున్నాయన్నారు. మత్స్యకారుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడంకి చందు, రాష్ట్ర కమిటీ సభ్యులు గారె శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల దశరథం, గగ్గూరీ రాజేశం, పట్టణ అధ్యక్షులు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

# పుట్టి పెరిగిన ప్రాంత అభివృద్ధికి కృషి

- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేం సాగర్‌రావు



కుమ్మరి సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రేం సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ఈ ప్రాంతంలో పుట్టి పెరిగినందుకు ఈ ప్రాంత అభివృద్ధి కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని, డబ్బులు, పదవుల కోసం కాదని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో ఎన్నికల ప్రచార సమావేశాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. 20ఏళ్లుగా ఎమ్మెల్యేగా పనిచేసిన నడిపెల్లి దివాకర్‌రావు చేసిన అభివృద్ధి ఏమి లేదని, 20ఏళ్ల వెనక్కు వెళ్లిందని, తాను గెలిచిన వెంటనే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానన్నారు. జాఫర్‌నగర్ కాలనీ ప్రజలు మంచినీటి సమస్యతో బాధపడుతున్నారని, వారికి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీనిచ్చారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను గతంలో అమలు చేసిందని, ప్రస్తుతం ఆరు గ్యారంటీల హామీలతో పాటు, మరికొన్ని ప్రజలకు మేలు జరిగే హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచి, ఎన్నికలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కాంగ్రెస్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, గెలిచిన వెంటనే మేనిఫెస్టోలో తెలిపిన అన్నింటినీ అమలు పరుస్తామన్నారు. మంచిర్యాలలో ఐటీ హబ్ పార్కు, ఇండస్ట్రియల్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు తాను కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో కుమ్మరి సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని, తనను భారీ మెజారిటీతో ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**'అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి'**

నస్పూర్: నియోజకవర్గ అభివృద్ధికై రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా సమితి సభ్యులు కొట్టి కిషన్‌రావు తెలిపారు. సీపీఐ, కాంగ్రెస్ నాయకులు కలిసి పట్టణ పరిధిలోని 23వ వార్డులోని నస్పూర్ కాలనీలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి ప్రేంసాగర్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్ రావు, జిల్లా సమితి సభ్యులు మోత్కూరి కొమురయ్య, కోడి వెంకటేశం, నాయకులు సందీప్, లచ్చిరెడ్డి, పోశం, రషీద్, రాజన్న, లక్ష్మణ్, చంద్రజమోహగన్, తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ, కాంగ్రెస్ నాయకులు

# ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



పోస్టల్ బ్యాలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

చెన్నూర్: శాసన సభ ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియామవళిపై అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు అందించిన హ్యాండ్‌బుక్ పై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్, కౌటింగ్ కార్యక్రమాల్లో ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఈ నెల 30న జరిగే పోలింగ్ రోజున ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈవీఎంలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో 743పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎన్నికల అధికారి సిడాం దత్తు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

**పోస్టల్ బ్యాలెట్లు సద్వినియోగం చేసుకోవాలి**

బెల్లంపల్లి: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. బెలంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి పోస్టల్ బ్యాలెట్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అధికారులు, సిబ్బంది తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. పొరపాట్లకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో అత్యవసర సేవలు అందిస్తున్న పలు విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెల్లరేషన్ కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తాం

- మంచిర్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు



దండేపల్లి: గుడిరేవు ఎన్నికల ప్రచారంలో దివాకర్‌రావు

దండేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తే, తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని నాగసముద్రం, మాకులపేట, అల్లీపూర్, గుడిరేవు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పతి కోసం సతి..**

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న నడిపెల్లి దివాకర్‌రావు సతీమణి నడిపెల్లి రాజకుమారి తన భర్త గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో ప్రతి ఇంటికీ వెళ్లి, సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేసిన సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. మరోసారి మంచిర్యాల ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి దివాకర్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న దివాకర్‌రావు సతీమణి

# 'అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకే మా మద్దతు'



మాట్లాడుతున్న సునీల్

చెన్నూర్/నస్పూర్: అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకే మా మద్దతునిస్తామని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ అన్నారు. చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో, సీసీసీ నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు ఎస్సీ వర్గీకరణ చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. బీజేపీ 30ఏళ్ల మాదిగల కల సాకారం కానుందన్నారు. నియోజకవర్గానికి చెందిన మాదిగ కులస్తులు ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు కడారి రమేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ సంజయ్, చెన్నూర్ ఇన్‌చార్జి రామగిరి రాజేశ్, నాయకులు సుందిళ్ల సంతోశ్, సమ్మయ్య, తగరం సత్యనారాయణ, స్వరన్, సజన్, సుమంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సీఐ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని గురునానక్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన అభ్యర్థుల, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా, సమర్థవంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు చూడాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వహించాలని తెలిపారు. అనుమతి లేకుండా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించవద్దని, ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లాలో సాయంత్రం పోలింగ్ 4గంటలకు ముగుస్తుందని, ఆ సమయంలోపు ఓటర్లు గేట్ లోపలికి వెళ్లాలన్నారు. ప్రచారాలు 48గంటల ముందు నిలిపివేయాలని తెలిపారు. అనంతరం ఎన్నికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మణ్, ప్రసాద్, రామయ్య, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీని ప్రజలు ఆదరించాలి

- చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్



మాట్లాడుతున్న దుర్గం అశోక్



భీమారం: ప్రచారం చేస్తున్న దుర్గం అశోక్

రామకృష్ణాపూర్: అన్ని వర్గాల ప్రజలను మోసగించిన బీఆర్ఎస్ పార్టీకి ఓటుతో తగిన గుణపాఠం చెప్పి ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. బీజేపీ ద్వారానే అన్ని వర్గాల వారికి లాభం చేకూరుతుందని అభివృద్ధి, సంక్షేమం డబుల్ ఇంజిన్ సర్కారు ద్వారానే సాధ్యమన్నారు. ముఖ్యంగా సింగరేణి సంస్థ ప్రైవేటీకరణ కాకుండా ఉండాలంటే బీజేపీనే గెలిపించాలని కోరారు.

**'బీజేపీవైపే తెలంగాణా ఓటర్లు'**

భీమారం: తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ వైపే ఓటర్లు నిలుస్తున్నారని చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఓట్లు వేయాలని కోరారు. ముఖ్యంగా పేదలకు న్యాయం చేసే పనులు చేయని ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. చెన్నూరు అభివృద్ధి కోసం తనను గెలిపించాలన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని బుద్దారం, సంకారం, కన్నెపల్లి గ్రామాల్లో మంగళవారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. దుర్గం అశోక్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రచారంలో బీజేపీ నాయకులు కొటారి వెంకటేశ్, కొటారి బాపు పాల్గొన్నారు.

# జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా సినీనటుల ప్రచారం



జన్నారం: ప్రచారంలో పాల్గొన్న సినీనటులు

జన్నారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీతారలు జన్నారం మండలానికి వచ్చి సందడి చేశారు. జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ తరుపున యజ్ఞం సినిమా విలన్ విజయ గంగరాజు, రియల్‌స్టార్ హీరో అప్సర్ ఆజాద్, నిర్మాత రాజశేఖర్, ఎన్నారై బాలరాజుగౌడ్‌లు ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ టీపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా జాన్సన్‌నాయక్ వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని పొనకల్, కిష్టాపూర్, కలమడుగు గ్రామాల్లో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో మండలంలోని బీర్సాయిపేట, దంతన్‌పల్లి, శ్యాంపూర్, హస్నాపూర్ గ్రామాల్లో జెడ్పి చైర్మన్ జనార్దన్ రాథోడ్, నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువకులు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్రాభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. చారులత రాథోడ్, ధరణి రాజేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్: యాదవుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని.. ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పట్టణంలోని యాదవ సంఘ భవనంలో కులస్తులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం యాదవులు విఠల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

దస్తురాబాద్/ఖానాపూర్: జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని గోసంపల్లె, రాంపూర్, రేవోజీపేట, మున్యాల, గోడిసిర్యాల, దస్తురాబాద్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

# భూముల రిజిస్ట్రేషన్లపై ఎన్నికల ప్రభావం




నెన్నెల తహసీల్దార్ కార్యాలయం

నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల ప్రభావం తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే భూముల రిజిస్ట్రేషన్లపై పడింది. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఈ కార్యాలయాల్లో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు భూ రిజిస్ట్రేషన్లు చేయొద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో అక్కడ దాదాపు నిలిచిపోయాయి. మిగితా మండల కేంద్రాల్లో అయితే నగదు లావాదేవీల ఇబ్బంది కారణంగా తక్కువ మొత్తంలో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

**రెవెన్యూ సిబ్బందికి ఎన్నికల విధులు..**

సాధారణంగా ప్రతి నియోజకవర్గ పరిధిలో ఐదు నుంచి ఏడు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో రెవెన్యూ సిబ్బంది, తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్లకు ఎన్నికల సందర్భంగా నామినేషన్ ఉపసంహరణ మొదలుకొని ఎన్నికలు ముగిసే వరకు వివిధ బాధ్యతలు అప్పగించారు. వారంతా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అక్కడే సమయాన్ని కేటాయించారు. ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి నామినేషన్ పత్రాలు సరి చూడటం, అభ్యర్థులకు సూచనలు ఇవ్వడం, డిపాజిట్‌లు స్వీకరించడం పరిశీలన, ఉపసంహరణ తదితర బాధ్యతలు చూశారు. మిగిలిన కొంత సమయం ఇతర విధులు నిర్వర్తిస్తున్నారు.

**నగదు లావాదేవీలకు ఇబ్బంది...**

భూముల ధరలు ఆకాశాన్నంటిన కారణంతో గతేడాది కాలంగా భూముల కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి. అక్కడక్కడా క్రయవిక్రయాలు జరపాలన్న నగదు లావాదేవీలకు వీలు లేదు. భూ విక్రయాలకు డబ్బు తీసుకురావడం, ఇవ్వడం వంటి లెక్కలు పక్కాగా ఉండాలి. జీరో పద్ధతిలో వెళ్లే వారికి సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో కొందరు వాయిదా వేసుకుంటున్నారు. స్లాట్‌బుక్ చేసుకునే వారు తగ్గిపోవడంతో గతంతో పోల్చితే ప్రస్తుతం 4వ వంతు రిజిస్ట్రేషన్లు అవుతున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం: మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని గ్రామాలకు బుధవా రం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని ఏఈ కుమారస్వామి తెలి పారు. సబ్‌స్టేషన్‌కి 33 కేవీ లైన్ నిర్మించే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.